సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 18 । జనవరి । 2025



తుది దశకు కబడ్డీ పోటీలు

నరసాపురంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. నేడు సెమీస్, ఫైనల్స్ జరుగనున్నాయి. IIలో ▸



హరికథే ఆమె ప్రత్యేకత

తాడేపల్లిగూడేనికి చెందిన యాళ్లబండి భువనేశ్వరీ హరికథ కళకు అంతర్జాతీయ ప్రాచుర్యం తీసుకువస్తున్నారు. ఆమె అమెరికాలో ఉంటూ సేవలందిస్తున్నారు. IIలో ▸



వివాహిత మృతి

బంధువులను పరామర్శించడానికి వెళ్తున్న వివాహిత రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శివదేవుని చిక్కాలలో చోటుచేసుకుంది. IIలో ▸

ప్చ్.. పరువు పోయిందిగా!

సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు చూస్తారన్నారు., ప్రయాణం సాఫీగా సాగేలా చేస్తామన్నారు.. తీరా చూస్తే సగం గుంతలు కూడా పూడ్చలేకపోయారు.. చేసిన పనుల్లోనూ నాణ్యతాలోపంతో 'కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిన' చందాన పరిస్థితి తయారవ్వడంతో పండక్కి వచ్చిన బంధువుల ముందు పరువు పోయిందని కూటమి నేతలు మధనపడుతున్నారు.

కూటమి క్లీన్ బౌల్డ్

- సంక్రాంతికి గుంతలు లేని రోడ్లంటూ ప్రభుత్వం గొప్పలు
- జిల్లాలో 181 రోడ్లలో పనులకు రూ.42.57 కోట్లు మంజూరు
- కనీసం 50 శాతం కూడా పూర్తికాని పనులు
- కొన్నిచోట్ల మొదలుకాని మరమ్మతులు
- నాసిరకం పనులతో ప్రజల అవస్థలు
- పండుగ చుట్టాల ముందు పరువు పోయిందని నేతల మధనం



ప్రమాదభరితంగా కంతేరు నుంచి పెనుగొండ వెళ్లే రోడ్డు

సాక్షి, భీమవరం : సంక్రాంతి పండుగల కోసం జిల్లాకు దేశ,విదేశాల నుంచి బంధుమిత్రులు తరలి వస్తుంటారు. వారం పది రోజులు ఇక్కడే ఉండి వివిధ ప్రాంతాల్లో జరిగే కోడి పందేలు, ఉత్సవాలను తిలకించే పర్యాటకులతో జిల్లాలోని రోడ్లన్నీ కిక్కిరిసిపోతాయి. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో సంక్షేమ పథకాలను అటకెక్కించిన కూటమి ప్రభుత్వం తమ పాలన గొప్పగా ఉందని బయటి ప్రపంచానికి చెప్పుకునేందుకు రోడ్లు బాగుచేయాలని నిర్ణయించింది. పండుగ చుట్టాలు లక్ష్యంగా సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లంటూ ప్రకటనలు గుప్పించింది. ప్యాచీ వర్కులు, అత్యవసర మరమ్మతుల నిమిత్తం జిల్లాకు రూ.42.57 కోట్లు మంజూరు చేసింది. స్టేట్ హైవే (ఎస్‌హెచ్) రోడ్లలో రూ.10.45 కోట్లు విలువైన 41 పనులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల (ఎండీఆర్)లో రూ.32.12 కోట్లు విలువైన 140 పనులు ఉన్నాయి. వీటిలో భీమవరం నియోజకవర్గంలో 77.42 కి.మీ, ఉండి నియోజకవర్గంలో 151.88 కి.మీ, పాలకొల్లులో 73.59 కి.మీ, ఆచంటలో 97.38 కి.మీ, తాడేపల్లిగూడెంలో 142 కి.మీ, నరసాపురంలో 55 కి.మీ, తణుకులో 56.8 కి.మీ మేర మరమ్మతులు చేయాల్సి ఉంది.

45 శాతం పనులే.. సంక్రాంతికి చుట్టాలు వచ్చేటప్పటికి గుంతలు లేని రోడ్లు చూస్తారంటూ స్వస్థలాలకు వచ్చే తమ బంధుమిత్రుల వద్ద కూటమి నేతలు గొప్పలు పోయారు. కాగా సంక్రాంతి నాటికి రూ.18.5 కోట్ల విలువైన 45 శాతం పనులు మాత్రమే పూర్తిచేయడం గమనార్హం. కొన్నిచోట్ల పండుగల మూడు రోజులు మన్నితే చాలన్నట్టు ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా పనులు చేయగా, మరికొన్ని చోట్ల గుంతల్లో మెటల్, చిప్స్ వేసి తారు వేయకుండా వదిలేశారు. దీంతో గుంతలు పూడ్చిన కొద్దిరోజులకే రాళ్లుపైకి లేచి ప్రమాదభరితంగా తయారై పండుగ చుట్టాలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

అధ్వానంగా రోడ్డు



మా స్వగ్రామం అత్తిలి కాగా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. ఏటా మాదిరి ఈసారీ సంక్రాంతికి సొంతూరు వచ్చాను. భీమవరం నుంచి అత్తిలి వచ్చే రోడ్డు దారి పొడవునా పెద్దపెద్ద గోతులతో చాలా ప్రమాదభరితంగా ఉంది. త్వరితగతిన రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– సత్యాల మనోహర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాద్

గుంతలు పూడ్చలేదు



సంక్రాంతి పండుగ కోసం ఐర్లాండ్ నుంచి స్వస్థలానికి వచ్చాను. సంక్రాంతికి గుంతలు లేకుండా రోడ్లను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెప్పినట్టుగా సోషల్ మీడియాలో చూశాను. ఇక్కడకు వచ్చాక చూస్తే రాళ్లుపైకి లేచిపోయి రోడ్లు అధ్వానంగా కనిపించాయి. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

– అంబటి కల్యాణ్, ఎన్ఆర్ఐ, నరసాపురం

30 పనులు మొదలే కాలేదు

జిల్లాలోని 181 రోడ్లలో మరమ్మతులు చేయాల్సి ఉండగా 151 రోడ్లలో మాత్రమే పనులు మొదలయ్యాయి. భీమవరం నుంచి మోగల్లు, ఈడూరు మీదుగా అత్తిలి వెళ్లే రోడ్డు, కంతేరు నుంచి కాతేరు మీదుగా పెనుగొండ వెళ్లే రోడ్డు, ఇరగవరం నుంచి ఏలేటిపాడు రోడ్డు తదితర రోడ్లలో 30 పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం గమనార్హం. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఓ అధికారి తెలిపారు. పనులు జరిగిన మేర ప్రభుత్వం నుంచి బిల్లుల విడుదలలోనూ తీవ్ర తాత్సారం జరుగుతోందని అన్నారు.



కనీస మరమ్మతులకు నోచుకోని ఈడూరు-అత్తిలి రోడ్డు

పరువు పోయిందని ఆవేదన

కూటమి వచ్చాక సంక్షేమ పథకాలు అమలులేక పండుగలా లేదని ప్రజలు, వ్యాపారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. సంక్రాంతి నాటికి చేస్తామని చెప్పిన గుంతలు పూడ్చే పనికూడా పూర్తి చేయలేకపోయామని కూటమి నేతలు ఆవేదన చెందుతున్నారు. నాసిరకం, అసంపూర్తి పనులతో రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని అంతర్మథనం చెందుతున్నారు. పనులు పూర్తవ్వక చుట్టాల ముందు చులకనయ్యామని చర్చించుకుంటున్నట్టు తెలుస్తోంది. గురువారం ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో కూటమి ఎమ్మెల్యేలే సమయానికి రోడ్డు పనులు పూర్తిచేయలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

రీ సర్వేపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం: రీ సర్వేపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీలార్లు, మండల సర్వేయర్లు, డీటీలు, వీఆర్వోలతో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో దశ రీ సర్వే పనులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీ మాట్లాడుతూ సర్వే రికార్డులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులు కచ్చితంగా పాటించాలన్నారు. శాఖల వారీగా ఇరిగేషన్, డ్రైనేజీ, దేవస్థానం, జెడ్పీ భూములకు సంబంధించి ముందుగా నోటీసులు ఇచ్చి సర్వే నిర్వహించాలన్నారు. రైతులకు కూడా ముందుగా నోటీసులు ఇచ్చి వారి సమక్షంలోనే సర్వే చేయాలన్నారు. ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఇన్‌చార్జ్ జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాస్, డివిజన్ సర్వే అధికారులు మల్లికార్జునరావు, రాంబాబు పాల్గొన్నారు.

నేడు 'నవోదయ' పరీక్ష

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 2025–26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశాలకు పరీక్షను శనివారం నిర్వహించనున్నట్టు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటుచేశామని, ఉదయం 10 గంటలకు విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నవోదయ వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని తీసుకురావాలన్నారు. బ్లాక్ లేదా బ్లూ పెన్‌తో మాత్రమే జవాబులు బబుల్ చేయాలని, కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్లు 63030 39477, 94907 287768, 96406 76608, 90785 68664, 80748 33690, 94917 31486లో సంప్రదించాలని కోరారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



అకౌంట్స్ ఆఫీసర్‌ని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అకౌంటెంట్ జనరల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఎస్.బాలాజీ అన్నారు. భీమవరం సబ్ ట్రెజరీ కార్యాలయంలో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. పెన్షన్ అసోసియేషన్ నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ అసోసియేషన్ నాయకులు సమైక్యంగా పెన్షనర్లకు సేవలందించడం అభినందనీయమన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్, భీమవరం యూనిట్ ప్రధాన కార్యదర్శి పి.సీతారామరాజు, పి.సూర్యనారాయణ, కె.ముత్యాలరావు, కె.చంద్రరావు, ఆర్ఎస్ సూర్యనారాయణ, బి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కిడ్నాపర్లు

భీమవరం: భీమవరంలో గురువారం ఆక్వా వ్యాపారి వి.సత్యనారాయణను కిడ్నాప్ చేసిన వ్యక్తులను అనంతపురంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఆర్థిక లావాదేవీల కారణంగా కొందరు వ్యక్తులు కారులో వచ్చి భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ వద్ద సత్యనారాయణను బలవంతంగా తీసుకువెళ్లారు. కేసు దర్యాప్తులో భాగంగా టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ సీసీ పుటేజీల ద్వారా కిడ్నాప్ చేసిన కారు వెళ్లిన మార్గాలను పరిశీలిస్తూ అనంతపురం పోలీసులను అప్రమత్తం చేశారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

డీఎస్పీ జయసూర్య బదిలీ

భీమవరం: భీమవరం డీఎస్పీ ఆర్‌జే జయసూర్య బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎస్.మహేంద్రను నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ఇరిగేషన్ ఎస్‌ఈగా నాగార్జునరావు

ఏలూరు(మెట్రో): ఏలూరు సర్కిల్ ఇరిగేషన్ ఎస్‌ఈగా పి.నాగార్జునరావు నియమితులయ్యారు. ఇరిగేషన్ శాఖలో ఇచ్చిన పదోన్నతులు, బదిలీల్లో భాగంగా నాగార్జునరావును ప్రభుత్వం బదిలీ చేసింది. నాగార్జునరావు ప్రస్తుతం గోదావరి వెస్ట్రన్ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గతంలో భీమవరం డ్రైనేజీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఆరేళ్లు సేవలందించారు.

'స్వచ్ఛ ఆంధ్ర'కు చర్యలు

కలెక్టర్ నాగరాణి



భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇకపై ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్' కార్యక్రమం నిర్వహణకు చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆమె మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతానికి సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో పట్టణ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకూ అధికారులు అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి బీవీవు, డీపీఓ అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

భీమవరం కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో 76వ గణతంత్ర దినోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. వేదిక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల శకటాలు, స్టాల్స్‌ను సిద్ధం చేయాలన్నారు. భద్రతా చర్యలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్ర సమరయోధులు, ప్రజాప్రతినిధులు, అతిథులు సిట్టింగ్ ఏర్పాట్లపై సూచనలిచ్చారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఏఎస్పీ వి.భీమారావు, ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డీఈఓ ఈ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కండక్టర్ల మార్పునకు చర్యలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో భీమడోలు–పెదవేగి, భీమడోలు–ఏలూరు ఫీడర్‌లలో కండక్టర్ల మార్పునకు చర్యలు తీసుకున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. భీమడోలు–పెదవేగి పనులు శనివారం నుంచి ఈనెల 31 వరకు, భీమడోలు–ఏలూరు పనులు వచ్చేనెల 1 నుంచి 15 వరకు జరుగుతాయన్నారు. ఆ సమయంలో పెదవేగి, ఏలూరు విద్యుత్ కేంద్రాలకు కానుమోలు విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేశామని, ఏదైనా లోపంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సహకరించాలని కోరారు.

తణుకు పోలీస్‌స్టేషన్ వద్ద హైడ్రామా

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఎమ్మెల్యే ఆరిమిల్లి దౌర్జన్యకాండ
- ఎమ్మెల్యే హుకుంతో స్టేషన్‌కు వచ్చిన ఆర్టీఓ
- మధ్యాహ్నం 12 గంటల నుంచి పోలీస్‌స్టేషన్‌లోనే బాధితుడు



తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త పంజా దుర్గారావుపై తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేసిన దౌర్జన్యకాండ శుక్రవారం తణుకులో సంచలనం రేకెత్తించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా, అధికార పార్టీ చేస్తున్న అక్రమాలను సోషల్ మీడియా ద్వారా ఎండగడుతున్న దుర్గారావును టార్గెట్ చేసిన ఎమ్మెల్యే నడిరోడ్డుపై ఒక సామాన్య ఆటో డ్రైవర్ అని కూడా చూడకుండా వెంటాడి వీరంగం చేసిన ఘటనను ప్రజలు చీదరించుకుంటున్నారు. బెదిరించి, ఇష్టానుసారంగా దూషించిన తర్వాత పోలీసులకు అప్పగించడం, ఆపై స్టేషన్‌లో నడిచిన హైడ్రామాపై పలువురు విమర్శిస్తున్నారు. ఉదయం 12 గంటల నుంచి తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హైడ్రామా నడిచింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్న దుర్గారావును స్టేషన్‌లో ఎవరూ కలవకుండా నిర్బంధించడం, వ్యవహారాన్ని గుట్టుగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది. టీడీపీకి చెందిన ప్రముఖులు స్టేషన్‌కు రావడం, అధికారులతో మంతనాలు జరపడం, లీగల్ బృందంతో సంప్రదింపులు జరపడం వెనుక భారీ కుట్ర పూరిత వ్యవహారం నడుస్తోందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కుటుంబసభ్యులు భయాందోళనలు వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఒత్తిడితో పోలీసులు ఏ కేసులు నమోదు చేస్తారో, ఎక్కడికి తీసుకువెళ్తారోననే ఉత్కంఠ నడిచింది. రాత్రి 10.30 గంటలు గడిచినా దుర్గారావును స్టేషన్‌లోనే ఉంచడం, సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై విచారణ చేయాల్సి ఉందని పోలీసు అధికారులు చెబుతుండటం వంటి అంశాలు అనుమానాస్పదంగా మారాయి.

విడ్డూరంగా ఆర్టీఓ తీరు

సామాన్య ఆటోడ్రైవర్ వ్యవహారానికి సంబంధించి ఎమ్మెల్యే ఆదేశాలతో ఆర్టీఓ హుటాహుటిన పోలీసు స్టేషన్‌కు రావడం, వెంటనే దుర్గారావు ఆటోను స్వాధీనం చేసుకుని నిమిషాల వ్యవధిలోనే తణుకు ఆర్టీసీ బస్‌డిపోకు తరలించడం విడ్డూరంగా మారింది. ట్రాఫిక్ రూల్స్ పాటించలేదని, జిల్లా మారి హైవేపైకి ఆటో వచ్చిందని తదితర కారణాలు చూపించి రూ.3,400 జరిమానా విధించడం, రవాణా కార్యాలయం నుంచి పనిగట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మరీ అధికారం చూపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు చూపిస్తున్న అధికారదర్పాన్ని చూసిన తోటి ఆటోడ్రైవర్లు ముక్కున వేలేసుకున్నారు.

కన్నీరుమున్నీరవుతున్న భార్య, పిల్లలు

భర్త దుర్గారావును చూసేందుకు తణుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన భార్య నాగలక్ష్మి, కుమార్తెలు కన్నీరుమున్నీరయ్యారు. ముఖ్యంగా ఆడబిడ్డల రోదనలు తణుకువాసులను కదిలించాయి. జగన్‌పై ఉన్న అభిమానంతో పోస్టులు పెడతారని, జగన్‌పై అభిమానంతో ఉండటం తప్పా అని నాగలక్ష్మి రోదించారు. తన భర్తకు ఏదైనా జరిగితే తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బాధ్యత వహించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అన్నే భవనంలో జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను 7 గంటలకు కుదించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ప్రధానంగా మెట్టలో మొక్కజొన్న, మిర్చి, పొగాకు, ఉద్యాన పంటల రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్‌ను 9 గంటల నుంచి 7 గంటలకు కుదించడం దారుణమన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలపై అన్నదాతలు ఆందోళన చెందతుఉన్నారని అన్నారు. అలాగే కొత్తగా బోర్లు వేసుకున్న రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సిరిబత్తుల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో అన్నదాత గగ్గోలు

- వ్యవసాయ విద్యుత్ సరఫరా కుదింపు
- 2 గంటలు తగ్గించడంతో ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో రైతులు



నీరు లేక ఎండిపోతున్న పైరు



మొక్కజొన్న తోటలో విద్యుత్ మోటార్

చాట్రాయి: వ్యవసాయం దండగ అనే భావనలో అన్నదాతల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాను 9 గంటల నుంచి 8 గంటలకు కుదించారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి 7 గంటలకు తగ్గించారు.

గురువారం 6 గంటలు విద్యుత్ సరఫరా చేసిన అధికారులు.. శుక్రవారం 7 గంటల పాటు సరఫరా చేశారు. ఇలా రెండు గంటల పాటు కోత విధిస్తుండటంతో చేలకు పూర్తిస్థాయిలో సాగు నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సగం పంటలకే నీరు

చాట్రాయి మండలంలో సుమారు 9,500 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం 500 ఎకరాల్లో మిరప, 250 ఎకరాల్లో కూరగాయలు, 10 వేల ఎకరాల్లో రబీ మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. విద్యుత్ కోతతో సగం పంటకే నీరందుతుందని రైతులు వాపోతున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్‌తో వ్యవసాయాన్ని పండుగ చేశారని, దీంతో మెట్ట ప్రాంతంలోనూ రైతులు రెండు పంటలు పండించుకోగలిగారని అంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పగటి పూట 9 గంటల వరకు విద్యుత్ సరఫరా చేశారని గుర్తుచేస్తున్నారు. రెండు పంటలతో ఆదాయాన్ని గడించి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని, ఇప్పుడు విద్యుత్ సరఫరాలో కోతతో పంటల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. చంద్రబాబు సర్కారు వ్యవసాయానికి పూర్తిస్థాయిలో విద్యుత్ అందించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో తగ్గించాం

సౌర విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయానికి రెండు గంటల విద్యుత్ సరఫరాను తగ్గించాం. మరలా విద్యుత్ ఉత్పత్తి పెరిగిన తర్వాత 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తాం.

– సంజయ్, ట్రాన్స్‌కో ఏఈ, చాట్రాయి

కోతలు దారుణం



వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ని రెండు గంటల కోత విధించడం దారుణం. దీంతో సగం పంటకే నీరు పెట్టుకోవాల్సి వస్తోందతి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 9 గంటలు విద్యుత్ సరఫరా చేశారు. అప్పుడు లేని కోతలు ఇప్పుడు ఎందుకు.

–మిద్దె చెన్నారావు, రైతు, కోటపాడు, చాట్రాయి మండలం

క్లుప్తంగా

ధర్మ రక్షణకే హిందూమతం పుట్టుక



భక్తులకు ప్రవచనాలను బోధిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

కాళ్ల/ఆకివీడు: ధర్మాన్ని రక్షించడానికి హిందూ మతం పుట్టిందని గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. విశ్వధర్మ విజయ యాత్రలో భాగంగా క్షేత్ర యాత్ర నిర్వహిస్తున్న దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ శుక్రవారం సాయంత్రం కాళ్ల గ్రామంలోని దత్తపాదుకా క్షేత్రానికి విచ్చేశారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన సుమారు 200 మందికి పైగా మహిళలతో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా సచ్చితానంద స్వామజీ భక్తులకు ప్రవచనాలను బోధించారు. కార్యక్రమంలో పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, గోళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం సాయంత్రం ఆకివీడులోని దత్త క్షేత్రాన్ని సందర్శించి, క్షేత్ర అభివృద్ధికి రూ. 55 లక్షలు ఫిక్సిడ్ డిపాజిట్ సొమ్మును అందజేశారు. అనంతరం నిర్వహించిన సత్సంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎంతో పుణ్యం చేసుకుంటేనే భారతదేశంలో పుడతారన్నారు. చిన్న స్వామీజీ విజయానంద, దత్త క్షేత్ర కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

ముదినేపల్లి రూరల్: బంగారం తాకట్టు పెట్టిన సొమ్ముతో సంక్రాంతి పండుగ రోజున ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు తిరిగిరాలేదని యువకుడి బంధువులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిగురుకోట గ్రామానికి చెందిన బత్తుల వీరహనుమాన్(33) పండుగ రోజున కైకలూరు వెళ్లి తన భార్య బంగారపు చైనును తాకట్టు పెట్టగా వచ్చిన డబ్బును తీసుకుని బయటకు వెళ్లాడు. అనంతరం హనుమాన్ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో హనుమాన్ సోదరుడు శరత్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

రైతు నాయకుడు రాఘవరెడ్డి మృతి



రాఘవరెడ్డి (ఫైల్)

పెంటపాడు: పెంటపాడుకు చెందిన రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు, సర్ ఆర్థర్ కాటన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత నల్లమిల్లి వీరరాఘవరెడ్డి (76) శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. చిన్నకుమారుడు నల్లమల్లి అంజిరెడ్డి వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు. రాఘవరెడ్డి ముదునూరు సొసైటీ అధ్యక్షుడిగా సేవలను అందించారు. వ్యవసాయ రంగంలో ఆయన చేసిన కృషికి గాను స్వాతంత్ర్య, గణతంత్ర్య వేడుకలలో అప్పటి సీఎంలు అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డులు పొందిన ఘనత ఉమ్మడి జిల్లాలో రాఘవరెడ్డికే ఉంది. ఆయన మృతివార్త తెలుసుకొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు, అప్పడా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డి రఘురాం రాఘవరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి రైతాంగానికి తీరని లోటన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: పాలకొల్లు మండలం లంకలకోడేరు పంచాయతీ వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు (66) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భీమవరం రైల్వే ఎస్సై రమణ తెలిపారు. శుక్రవారం ఉదయం భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద నాగర్ సోల్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హరికథే ఆమె ప్రత్యేకత

- చిరుప్రాయం నుంచి హరికథా గానంతో అబ్బురపరుస్తున్న మహిళ
- అమెరికాలో ఉంటూ కూడా కళాసేవ

తెలిసీ తెలియని చిరుప్రాయంలో మూడేళ్ల వయసున్న సమయంలోనే తాత యాళ్లబండి తాతారావు భగవతార్ వద్ద హరికథలో శిక్షణ పొంది నాలుగేళ్ల ప్రాయంలోనే తొలి ప్రదర్శన ఇచ్చి అహుతుల చేత భళా అనిపించుకున్న హరికథా గాయకురాలు తాడేపల్లిగూడేనికి చెందిన యాళ్లబండి భువనేశ్వరి. ఆమె ప్రజ్ఞ, పాటవాలతో ఎంతో మంది కళాకారులకు ఆదర్శనీయంగా ఉంటుంది. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నా హరికథను మర్చిపోకుండా అంతర్జాతీయ స్థాయిలో ఆ కళకు ప్రాచుర్యం తీసుకు వస్తూ అందరి మన్ననలు పొందుతుంది.

– తాడేపల్లిగూడెం (టీఓసీ)



చిన్నతనంలో భువనేశ్వరి హరికథా గానం (ఫైల్)



బీవీఆర్ కళాకేంద్రంలో కథాగానం చేస్తున్న దృశ్యం



యాళ్లబండి తాతారావు (తాత), నానమ్మలు వద్ద భువనేశ్వరి



పలు బహుమతులతో భువనేశ్వరి (ఫైల్)

పట్టణానికి చెందిన ప్రముఖ హరికథా కళాకారుడు యాళ్లబండి తాతారావు భాగవతార్ గురించి హరికథ ప్రియులకు పరిచయం అవసరం లేను పేరు హరికథకే ఆయన జీవితం అంకితమిచ్చి ఎన్నో వేల ప్రదర్శనలు ఇచ్చి సత్కారాలు, బిరుదులు పొంది, ఎందరికో హరికథలో శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా ఆయన కుమారులు, కుమార్తెలకు కూడా హరికథ, సంగీత కళల్లోనే శిక్షణ అందించారు. ఆయన బాటలో మనుమరాలు యాళ్లబండి భువనేశ్వరికి కూడా రెండో ఏటా నుంచి తాతయ్య నుంచి శిక్షణ తీసుకోవడం ప్రారంభించింది. నాలుగేళ్లకే జాతీయ స్థాయి బాలల పాటలు పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. ఐదేళ్ల వయస్సులోనే తాడేపల్లిగూడెం అక్బర్ నెలకొల్పిన ప్రముఖ కళా సంస్థ చిరుగులాభి వేదికపై భువనేశ్వరీ తొలి ప్రదర్శన ఇచ్చి భళా అనిపించుకుంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో

అనంతరం తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక వేదికలపై ఆమె హరికథ ప్రదర్శనలు ఇచ్చింది. నర్సీపట్నంలోని పసిడి మొగ్గ అనే సంస్థ, కొత్త వలసలో కళాభారతి సంస్థల వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. ప్రముఖ హరికథకులు బుర్ర శివరామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో విశాఖ, చీరాల, రామగుండం, విజయవాడలో ప్రదర్శనలు ఇచ్చి ఘన సన్మానాలు పొందారు. విశాఖ కల్చరల్ అకాడమీ వారి ఉగాది పురస్కారం అందుకుంది. ముఖ్యంగా మాజీ ప్రధాని వాజ్‌పాయ్, కేంద్ర మాజీ మంత్రి ఎల్‌కే అద్వానీల సమక్షంలో జాతీయ గీతాలను ఆలపించి వారి ప్రశంసలు పొందింది. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రులు చెరుకువాడ రంగనాథరాజు, పైడికొండల మాణిక్యాలరావు సమక్షంలో హరికథలు చెప్పి మెప్పించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలుగు సినీ నటుడు సుమన్‌ల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

అమెరికాలో అసామాన్య ప్రతిభ

భువనేశ్వరి అమెరికా ఓక్లహోమా విశ్వ విద్యాలయంలో ఎంఎస్ చేసింది. అక్కడ విద్యార్థిగా ఎన్నో వేదికలపై తమ కళాశాల తరపున ప్రదర్శనలు ఇచ్చి వారి ప్రశంసలు పొందింది. బెంగళూరు, హైదరాబాద్‌లో ఒరాకిల్‌లో ఉద్యోగరీత్యా ఆ సంస్థ వేదికలపై కళా ప్రదర్శనలు ఇచ్చారు. అమెరికాలో ఉద్యోగరీత్యా ఉంటూ అక్కడి తెలుగు సంస్థల సభల్లో పలు ప్రదర్శనలు ఇచ్చారు.

> **అమెరికాలో హరికథ పాఠశాల ఏర్పాటే లక్ష్యం**
>
> తెలుగువారి హరికథ గొప్పతనాన్ని తెలియజేయాలని సంకల్పంతో అమెరికాలో హరికథ పాఠశాల ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాను. నెల రోజులుగా సెలువులు ఉండడంతో తల్లిదండ్రుల ఇంటికి వచ్చాను. ఇటీవల బీవీఆర్ కళా కేంద్రంలో సీతారామ కల్యాణం హరికథ చెప్పడంతో కళా పురస్కారం అందించి సత్కరించారు. అమెరికాలో నా భర్తతో కలిసి ఉద్యోగం చేస్తూనే హరికథ, శాస్త్రీయ సంగీతం ప్రచారం చేస్తాను.
>
> యాళ్లబండి భువనేశ్వరి

బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయంపై మహిళ ఫిర్యాదు

దెందులూరు: తన బ్యాంకు ఖాతాలో ఉండాల్సిన రూ.36,500 మాయమయ్యాయని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని దోసపాడు గ్రామానికి చెందిన ముంగర సత్యవతికి కొవ్వలి యూనియన్ బ్యాంకు శాఖలో ఖాతా ఉంది. అయితే ఈ నెల 16న ఆమె ఖాతా నుంచి రూ.36,500 కట్ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం బ్యాంకు అధికారులను సంప్రదించగా సరైన సమాధానం ఇవ్వకుండా మా తరఫున ఎలాంటి తప్పు లేదని చెప్పారని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ మాట్లాడుతూ బాధితురాలి ఫిర్యాదు విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వీఆర్‌ఓ ఆత్మహత్య



యార్లగడ్డ నాగరాజు (ఫైల్)

తణుకు అర్బన్: పట్టణంలోని ఏడో వార్డులో వీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న యార్లగడ్డ నాగ గంగరాజు అలియాస్ నాగరాజు (44) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగరాజు తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో నివసిస్తున్నారు. భార్య లక్ష్మి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉండగా, సంక్రాంతి పండుగ నేపథ్యంలో పిల్లలు మోర్తలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రాత్రి సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లుగా లెటర్ రాసి గల్ఫ్‌లో ఉంటున్న భార్య లక్ష్మికి వాట్సాప్ ద్వారా పంపించారు. ఆ మెసేజ్ చూసిన నాగరాజు భార్య కుమారుడు వేణుకి విషయం తెలిపి అతని స్నేహితులకు సమాచారం పంపించి ఇంటికి వెళ్లి చూసేసరికి నాగరాజు ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సాయంతో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. నాగరాజు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాధనంతో పార్టీ రంగులా?



తణుకు మహిళా కళాశాల రోడ్డులో పసుపు రంగులో ఎల్ఈడీ సెటప్



పసుపు రంగు ఎల్ఈడీ లైట్లతో తణుకు ఆర్ఓబీపై ఉన్న విద్యుత్ స్తంభాలు

తణుకు అర్బన్: ఐదేళ్లుగా జాతీయ జెండా రంగుల ఎల్ఈడీ లైట్లతో ఉన్న విద్యుత్ స్తంభాలు కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో పసుపు రంగు ఎల్ఈడీ లైట్లుగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏర్పాటుచేసిన పసుపురంగు వెలుగులపై ప్రజలు విమర్శలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా గత ఐదేళ్ల కూడా జాతీయ జెండాలోని రంగులను ఈ విద్యుత్ స్తంభాలకు వెలుగులు ఏర్పాటు చేసే సంస్కృతి తణుకులో గత పాలనలో ఉండగా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పసుపు రంగు వెలుగులు ఏర్పాటుచేయడాన్ని ప్రజలు సైతం తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. మునిసిపాలిటీకి ప్రజలు చెల్లించే వివిధ పన్నుల తాలూకా నిధులను ప్రజల అవసరాలు, సౌకర్యాల కోసం వెచ్చించాల్సి ఉండగా, పాలకుల ఆదేశాల మేరకు పార్టీ రంగైన పసుపు రంగులు ఏర్పాటు చేయడం ఏంటి? అని ప్రశ్నిస్తున్నారు. తణుకు రాష్ట్రపతి రోడ్డు, ఆర్వోబీ, వేల్పూరు రోడ్డు, పెరవలి రోడ్డు, ఉండ్రాజవరం రోడ్లల్లో విద్యుత్ దీపాలతో ఉన్న 150కు పైగా స్తంభాలకు పసుపు రంగున్న ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయడం గమనార్హం.

శ్రీవారి క్షేత్రంలో నోటీసుల కలకలం



ద్వారకాతిరుమలలో ఒక ఫంక్షన్ హాల్ యజమానికి అందించిన నోటీసు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ప్రైవేట్ అలాగే ట్రస్టుల ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని ఫంక్షన్ హాల్స్, లాడ్జీల యజమానులకు స్థానిక తహసీల్దార్ జీవీ సుబ్బారావు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. భూమికి సంబంధించిన ఆధారాలతో పాటు, ల్యాండ్ కన్వర్షన్, బిల్డింగ్ అప్రూవల్, ప్లాన్, ఫైర్ సేఫ్టీ అనుమతుల పత్రాలు, పార్కింగ్ స్థలం, వాటర్ సప్లయ్, ఎలక్ట్రిసిటీ, వేస్ట్ మేనేజ్‌మెంట్, రూముల కెపాసిటీ, క్రౌడ్ మేనేజ్‌మెంట్, జీఎస్టీలకు సంబంధించిన వివరాలను నోటీసు అందిన వారం రోజుల్లోగా అందించాలని నోటీసులో పేర్కొన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు. ద్వారకాతిరుమల క్షేత్రంలో సుమారు 50 వరకు ఫంక్షన్ హాల్స్, లాడ్జిలు ఉండగా తొలిరోజు కొన్నింటికి మాత్రమే నోటీసులు అందించారు. మిగిలిన వాటికి అందించాల్సి ఉంది. క్షేత్రంలో ఎక్కువ ఫంక్షన్ హాల్స్, లాడ్జిలు పదేళ్ల క్రితం నిర్మించినవే. అప్పటి నుంచి యజమానులు పంచాయితీకి అన్ని పన్నులు చెల్లించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి రెవిన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం వివాదాస్పదమైంది. కావాలనే కొందరు వ్యక్తులు ఫంక్షన్‌హాల్స్, లాడ్జిలను టార్గెట్ చేసి, నోటీసులు ఇప్పించారని యజమానులు ఆరోపిస్తున్నారు. అధికారులు వేధింపులు ఆపకపోతే కోర్టును ఆశ్రయిస్తామంటున్నారు.

తుది దశకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ముందంజలో ఢిల్లీ, ఆంధ్రా జట్లు



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

నరసాపురం: నరసాపురం రుస్తుంబాదలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 32వ జాతీయస్థాయి మహిళలు, పురుషులు ఇన్విటేషన్ కప్ కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. పోటీలు తుది దశకు చేరుకోవడంతో గెలుపుకోసం జట్లు తీవ్రంగా శ్రమిస్తున్నాయి సాగుతున్నాయి. లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు శనివారంతో ముగియనున్నాయి. శనివారం ఉదయం సెమీస్, రాత్రి ఫైనల్స్ జరుగుతాయి. ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో పురుషుల విభాగంలో ఆంధ్రా, ఢిల్లీ, యూసీ జట్లు, మహిళల విభాగంలో ఢిల్లీ, రాజస్థాన్, కేరళ జట్లు ముందంజలో ఉన్నాయి. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లకు సంబంధించి ఫలితాలు ఇలా ఉన్నాయి.

పురుషుల విభాగంలో

ఆంధ్రాజట్టు, చండీగఢ్ జట్టుపై 14 పాయింట్ల తేడాతో, మహారాష్ట్ర జట్టు హర్యానాపై 3 పాయింట్ల తేడాతో, మరో మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు హర్యానాపై 36 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. మహిళల విభాగంలో హైదరాబాద్ తెలంగాణ జట్టు ఆంధ్రా జట్టుపై 9 పాయింట్ల తేడాతో మహారాష్ట్ర జట్టు ఢిల్లీ జట్టుపై 6 పాయింట్ల తేడాతో గెలు పొందాయి. కేరళ, హర్యానా జట్ల మధ్య ఉత్కంఠగా సాగిన మ్యాచ్ టై అయ్యింది.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



ఊటాడ వెంకటరమణ (23) (ఫైల్)

పాలకొల్లు అర్బన్: బంధువులను పరామర్శించడానికి వెళ్తున్న వివాహిత రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన పాలకొల్లు–భీమవరం జాతీయ రహదారిలో శివదేవునిచిక్కాల వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురానికి చెందిన ఊటాడ వెంకటరమణ తన బంధువుల ఇంటికి సోదరుడితో కలిసి మోటార్ సైకిల్‌పై వెళ్తుంది. ఈ సమయంలో శివదేవునిచిక్కాల వద్ద పాలకొల్లు వైపు వెళుతున్న ట్రాక్టర్ మోటార్ సైకిల్‌ని ఢీకొట్టింది. దీంతో వెంకటరమణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆమె సోదరుడికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ మోటార్ సైకిల్ ఢీకొట్టిన అనంతరం ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. వెంకటరమణ గృహిణి, కాగా భర్త లక్ష్మణరావు వ్యవసాయ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. వెంకటరమణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు రూరల్ ఎస్సై బి సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం ఎఫ్‌సీఐ రోడ్డులోని పంట బోదేలో గుర్తు తెలియని మృతదేహం స్థానికులు గుర్తించారు. సుమారు 50–55 సంవత్సరాల వయస్సు ఉన్న పురుషుని మృతదేహం పంట బోదెలోని నీటిలో బోర్లా పడి ఉందని శృంగవృక్షం వీఆర్‌ఓ–2 దేవదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రవి వర్మ తెలిపారు. మృతదేహానికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా పాలకోడేరు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

25 మంది జూదరుల అరెస్టు

ఉంగుటూరు: సంక్రాంతి సందర్భంగా పేకాడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. నారాయణపురం టూరింగు పేటలో పేకాట స్థావరంపై దాడి చేసి 19 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మామిడాల సూర్యభగవాన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,66,020 నగదు, 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కంసాలిగుంటలో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడిపుంజులు, రూ.7 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సంతోషపురం మాజీ సర్పంచ్ హత్య



కాల్వ నల్లయ్య (ఫైల్)

కైకలూరు: మండలంలోని సంతోషపురం గ్రామ మాజీ సర్పంచ్ కాల్వ నల్లయ్య(58) హత్యకు గురయ్యారు. భోగేశ్వరం–సంతోషపురం రహదారిలో చేపల చెరువు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గురువారం సాయంత్రం పాతకక్షల నేపథ్యంలో భోగేశ్వరానికి చెందిన బోదనపు శ్రీను అనే వ్యక్తి బలమైన రాడ్‌తో తలపై కొట్టి పరారయ్యాడు. ముందుగా గుంతల రహదారిలో రోడ్డు ప్రమాదం జరిగిందని అందరూ భావించి, కలిదిండిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలించారు. కొద్ది సమయానికే నల్లయ్య మృతి చెందాడు. అయితే తర్వాత హత్య విషయం వెలుగులోకి రావడంతో కైకలూరు సీఐ వి.రవికుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు కాల్వ ఆంజనేయులు ఫిర్యాదుపై కలిదిండి ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య

భీమవరం: భీమవరం టూటౌన్ ఏరియాలోని ఓ లాడ్జిలో బట్టు దుర్గాప్రసాద్(27) ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం సాలిపేటకు చెందిన మృతుడు ఈ నెల 16న లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. శుక్రవారం ఉదయం కూడా తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి యజమాని తలుపులు పగలగొట్టి చూడగా సీలింగ్ రింగుకు ఉరివేసుకుని వేలాడుతున్నాడు. ఆన్లైన్ ట్రేడింగ్లో నష్టాలు ఆత్మహత్యకు కారణంగా తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు. ఈ మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



భీమవరం ఆర్టీసీ డిపోలో భద్రతా మాసోత్సవాల్లో మాట్లాడుతున్న డీటీఓ టి.మహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రతి ఏడాదీ రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న, తీవ్రంగా గాయాలు పాలువుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం, అతి వేగం, రహదారి నియమాలు పాటించకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పేరుతో వాహనాదారులకు అవగాహన కల్పిస్తుంది. పశ్చిమగోదావరి జిల్లాలో రవాణా శాఖ, ఆర్టీసీ, పోలీసుశాఖ సంయుక్తంగా ఈ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 16 తేదీ రహదారి భద్రత మాసోత్సవాలను జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. ఫిబ్రవరి 15 వరకు జిల్లాలో రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహించనున్నారు.

రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాలు ఇలా

తేదీ	పట్టణం	కార్యక్రమం
జనవరి 18	భీమవరం	డ్రైవర్లుకు హెల్త్ చెకప్, కంటి పరీక్షలు
జనవరి 19	తణుకు	రోడ్డు భద్రతపై అవగహన, సేఫ్టీపై కేసులు
జనవరి 20, 21	భీమవరం	డీఆర్ఎస్‌సీ, ప్రమాద ప్రాంతాల గుర్తింపు
జనవరి 22,23	తణుకు	కళాశాల విద్యార్థులకు వలంటీర్ల ద్వారా శిక్షణ
జనవరి 24,25	తాడేపల్లిగూడెం	కళాశాల బస్సు డ్రైవర్లకు వలంటీర్లు ద్వారా శిక్షణ
జనవరి 26	అన్ని పట్టణాల్లో	రోడ్డు సేఫ్టీపై అవగహన, కేసుల నమోదు
జనవరి 27,28	పాలకొల్లు	ర్యాలీ, హెల్మెట్, సెల్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన
జనవరి 29,30	భీమవరం	మహిళా ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ ర్యాలీ
జనవరి 31, ఫిబ్రవరి 1,2	తాడేపల్లిగూడెం	సాయం చేస్తే ఇచ్చే నగదు ప్రోత్సాహంపై అవగాహన
ఫిబ్రవరి–3	పాలకొల్లు	పిల్లలకు రోడ్డు భద్రతపై క్విజ్, వ్యాస రచన పోటీలు
ఫిబ్రవరి–4	పాలకొల్లు	రోడ్డు భద్రతపై అవగహన, సేఫ్టీపై కేసుల నమోదు
ఫిబ్రవరి 5	తాడేపల్లిగూడెం	మహిళా భద్రతపై ఆర్టీసీ, ప్రైవేట్ వాహనదారులకు సెమినార్
ఫిబ్రవరి 6,7	తణుకు	నేషనల్, స్టేట్ హైవేపై రోడ్డు సేఫ్టీ ఆడిట్
ఫిబ్రవరి 8,9	భీమవరం	రోడ్డు సేఫ్టీపై అవగాహన, కేసుల నమోదు
ఫిబ్రవరి 10	భీమవరం	సేఫ్టీపై వాహన చట్టం 2019 కొత్త అంశాలపై మీటింగ్
ఫిబ్రవరి 11,12	భీమవరం	ఆటో డ్రైవర్లకు భద్రతపై వలంటీర్లు ద్వారా శిక్షణ
ఫిబ్రవరి 13	తణుకు	సరుకు రవాణా చేసే వాహన డ్రైవర్లుకు శిక్షణ
ఫిబ్రవరి 14	తాడేపల్లిగూడెం	బీమా, రోడ్డు సేఫ్టీపై వర్క్ షాపు
ఫిబ్రవరి 15	భీమవరం	రోడ్డు సేఫ్టీపై ఉత్తమ వలంటీర్లకు అవార్డులు, బహుమతుల అందజేత

ఆరవల్లి వాసుల ఆరాధ్య దైవం యోగి వేమన

అత్తిలి: ఆరవల్లి ప్రజల ఆరాధ్యదైవం యోగి వేమన 100వ జయంతి ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. వేమన జయంతి ఉత్సవాలు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సాధారణంగా సంక్రాంతి వచ్చిందంటే గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. కానీ ఆరవల్లి గ్రామస్తులకు జనవరి 18న నిర్వహించే వేమన జయంతే పెద్ద పండుగ. గ్రామానికి చెందిన దేశ విదేశాలకు వెళ్లినవారు, వృత్తి, ఉపాధిరీత్యా బయట ప్రాంతాలకు వెళ్లిన వారు వేమన జయంతి రోజున తప్పకుండా స్వగ్రామానికి చేరుకుంటారు. వేమన జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మహిళలు, పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మానవ జీవితానికి సంబంధించిన అనేక నిత్యసత్యాలను తనదైన శైలిలో తేట తెలుగు పదాలతో వర్ణించి, తెలుగువారి హృదయాల్లో శ్రీయోగివేమన చిరస్మరణీయునిగా నిలిచారు. పండిత, పామరులనే బేధం లేకుండా వేమన పద్యాలు వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. వేమనకు, ఈగ్రామానికి చారిత్రకంగా ఎలాంటి సంబంధము లేకపోయినా ఆరవల్లి గ్రామ ప్రజలకు వేమన ఆరాధ్య దైవమయ్యారు. దీనిపై గ్రామస్తులు ఆశక్తికరమైన విషయం చెబుతారు. 1926కు ముందు గ్రామంలో ఏటా అగ్ని ప్రమాదాలు సంభవించేవి, అలాంటి పరిస్థితుల్లో గ్రామానికి చెందిన వి సత్యనారాయణరెడ్డి(దాసు) 1926 జనవరి 18న గ్రామంలో వేమన చిత్రపటాన్ని తాటాకు పందిరిలో ఉంచి పూజలు చేయడం ప్రారంభించారు. ఇలా చేయడంతో గ్రామంలో అగ్ని ప్రమాదాలు తగ్గిపోయాయట. అప్పటి నుంచి ప్రతీ ఏటా జనవరి 18న వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన యువత శ్రీయోగివేమన రెడ్డి యువజన సేవా సంఘాన్ని నెలకొల్పి పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్నారు. ఈ గ్రామంలో యువకులు అధికశాతం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తుంటారు.

కాలభైరవ సంతర్పణ...

వేమన జయంతి ఉత్సవాలలో భాగంగా ప్రతీ ఏటా జనవరి 18న ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నసమారాధన నిర్వహిస్తారు. ఈఅన్న సంతర్పణ కేవలం మనుషులకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామసింహాలైన శునకాలకు విస్తరాకులో ఆహార పదార్థాలను వడ్డించడం విశేషం. గ్రామానికి కాపలా ఉంటూ, గ్రామాన్ని రక్షించేది కాలభైరవుడని, ప్రతీ ఏటా గ్రామంలో కాలభైరవ సంతర్పణ పేరుతో గ్రామంలో ఉన్న శునకాలకు భోజనం వడ్డిస్తామని శ్రీయోగివేమన జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి తెలిపారు.


అత్తిలి మండలం ఆరవల్లిలో యోగివేమన విగ్రహం


ఆరవల్లిలో వేమన మందిరం

క్లుప్తంగా

చెడుగుడు పోటీల విజేత తన్విక్ కోహ్లీ టీమ్


ఉప్పరగూడెంలో పోటీల విజేతకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా ఫైనల్స్‌లో ఎంవీఆర్ టీమ్‌పై భీమవరం తన్విక్ కోహ్లీ టీమ్ హోరాహోరీగా పోరాడి విజయం సాధించింది. అనంతరం విజేతగా నిలిచిన తన్విక్ కోహ్లీ టీమ్‌కు రూ.40వేలు, రన్నర్ ఎంవీఆర్ టీమ్‌కు రూ.35వేలు, మూడో స్థానంలో నిలిచిన వెంకట్రావుపాలెం టీమ్‌కు రూ.30వేలు నగదును, ట్రోఫీలను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు వాడపల్లి సుబ్బరాజు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, అంబేడ్కర్ యూత్, జైభీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్వారీ లారీ డ్రైవర్ల ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను ఆటో నగర్ వద్ద శుక్రవారం క్వారీ లారీ డ్రైవర్లు, క్లీనర్లు ఆందోళన నిర్వహించారు. తమ జీతాలు పెంచాలని, బోనస్‌లు అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గతంలో 2022వ సంవత్సరంలో వేతనాలు పెంచుతూ లారీ యజమానులకు, కార్మికులకు ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. గత ఏడాది ఒప్పందం జరగాల్సి ఉందని, నేటీ వరకు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఏటా సంక్రాంతికి బోనస్‌లు ఇచ్చే వారని, వచ్చే ఏడాది నుంచి ఇచ్చేది లేదని యజమానులు స్పష్టం చేశారన్నారు. దీంతో గత రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉంద్రాజవరపు ఏసురత్నం, సెక్రటరీ, దొండపాటి శేషకుమార్, కోశాధికారి మార్లపూడి సూరిబాబు, తానేటి శ్రీను, ముప్పిడి అశోక్, మాముడూరి సతీష్, కూనపో నాగరాజు, అయినవిల్లి ప్రసాద్, రంగ తదితరులు పాల్గొన్నారు.

తీరు మారదా?


మునిసిపల్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై చెత్త

తణుకు అర్బన్: 'ఎక్కడి చెత్త అక్కడే' శీర్షికన శుక్రవారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ స్పందించారు. శుక్రవారం ఉదయం నుంచి పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా వార్డుల్లో తిరుగుతూ చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. మునిసిపల్ జేసీబీని ఉపయోగించి చెత్తను ట్రాక్టర్స్ ద్వారా కంపోస్టు యార్డుకు తరలించే పనులను స్వయంగా పర్యవేక్షించారు. పత్రికలో ప్రచురితమైన కథనంలోని ఏరియాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఆయా పరిసరాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చిమ్మించారు. ఇదిలా ఉండగా కథ మళ్లీ మొదటికి వచ్చింది. తణుకులో పలు ప్రాంతాల్లో శుక్రవారం కూడా చెత్త కుప్పలు దర్శనమివ్వడం కూడా పలు విమర్శలకు దారితీస్తున్నాయి. మునిసిపల్ కార్యాలయం ఎదురుగా రైతు సంఘం కార్యాలయం ముందు కాటన్ దొర విగ్రహం సాక్షిగా రోడ్డుపై చెత్త కుప్ప ఉండడాన్ని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో ఈ రకంగా పారిశుద్ధ్యం లేదని ఇప్పుడు కొత్తగా ఇలా రోడ్లపై చెత్త ఎందుకు ఉంటుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూట మి ప్రభుత్వ పాలన అసమర్థత కారణంగానే రహదారులపై చెత్తకుప్పలు ఉంటున్నాయని బాధిత వర్గా లు చెబుతున్నారు. గ తంలో చెత్త కుప్పలు రోడ్లపై ఉన్న దుస్థితి లేదని ఇంటి చెత్త నేరుగా కంపోస్టుకు తరలిపోయేదని చెబుతున్నారు.

వారానికోసారి డ్రైడేగా పాటించాలి

తణుకు అర్బన్: వారానికోసారి డ్రైడే పాటించే విధానాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, ఇంద్రయ్య నగర్ ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. జీవన విధానంలో ఆరోగ్యకరమైన అలవాట్లలో భాగంగా ప్రతి శుక్రవారాన్ని శుభవారం, పొడి వారంగా పాటించడం, డ్రెయిన్లలో చెత్త వేయకుండా ఉండడం ద్వారా దోమ పుట్టుకకు చెక్ పెట్టాలని సూచించారు. దోమ తెరలు వాడడం, శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటించి దోమ కాటు నుంచి రక్షణ పొందాలని స్పష్టం చేశారు. అనంతరం ఇందిరమ్మ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన హెల్త్ అండ్ న్యూట్రిషన్ కార్యక్రమంలో ఆరోగ్యానికి సమతుల ఆహారం తీసుకోవడం మంచి విధానమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎమ్ పద్మావతి, వార్డు హెల్త్ సెక్రటరీలు కె.ప్రసన్న రాణి, వి.రాజకుమారి, వార్డు ఉమన్ ప్రొటెక్షన్ సెక్రెటరీలు షేక్ షహనాజ్, ఎం.సుష్మిత, వార్డు సెక్రెటరీ డి.కల్యాణి, అంగన్‌వాడీ టీచర్ జి.సత్యవతి, ఆశా కార్యకర్తలు ఎ.అనురాధ, పి.లావణ్య పాల్గొన్నారు.


తణుకులో ఇంటి పరిసరాల్లోని డ్రమ్ములో నీటి నిల్వలను తొలగిస్తున్న వైద్య శాఖ సిబ్బంది

సీసీ రోడ్లకు శంకుస్థాపన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పలు ప్రాంతాలలో సీసీ రోడ్లకు, డ్రెయిన్‌లకు శుక్రవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శంకుస్థాపనలు జరిగాయి. 15వ వార్డులో సవిత్యపేట సంత మార్కెట్ నుంచి కబేళ వరకు రూ 98 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, 28వ వార్డులో టీచర్స్‌కాలనీలో సీసీ రోడ్డు, 28వ వార్డులో అరవ వీధి నుంచి గోయంక ఉమెన్స్ కళాశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణం, 30వ వార్డులో కట్టా వారి వీధిలో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణాలు జరిగాయి.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో ఉమారామలింగేశ్వరస్వామివారి ఆలయం పక్కన ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అభయ గణపతికి పంచామృత అభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుష్య బహుళ చవితి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో లక్ష్మీ, రుక్మిణి కల్యాణ పారాయణం, అభయ గణపతికి పంచామృత అభిషేకాలు జరిగాయి.

శ్రీదేవి మహంకాళమ్మకు ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కొబ్బరి తోటలో శ్రీదేవి మహంకాళమ్మతల్లి 45వ వార్షిక జాతర మహోత్సవాలు సందర్భంగా 5వ రోజు శుక్రవారం రాత్రి అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజల అందరికి ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి, గట్టిం మాణిక్యాలరావు, కర్రి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీ షాచే ఆధ్యాత్మిక ప్రవచనాలు జరిగాయి. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు పర్యవేక్షించారు.


శ్రీదేవి మహంకాళమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

ఏసుక్రీస్తు బోధనలు ప్రతిఒక్కరూ అనుసరించాలి

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని మాగంటి కల్యాణ మండపంలో పరిశుద్ధ సమాజ కూడికలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 'అక్కడ అతని నాశీర్వదించెను' అనే అంశంపై దైవ వర్తమానికులు జాన్ విక్టర్ ప్రసంగించారు. ఏసుక్రీస్తు బోధనలను విశ్వాసులు ప్రతీ ఒక్కరూ అనుసరించాలన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. దేవుని పట్ల విశ్వాసంతో నడుచుకోవడం ద్వారా ఆయన దీవెనలు పొందుతారన్నారు. దేవుని చిత్తం ఉంటేనే అన్ని కార్యాలు ముందుకు సాగుతాయన్నారు. దైవ సేవకులు బి.జాన్ పాల్, విశ్వాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

అత్తిలి: శ్రీయోగివేమన శత జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు రెండో రోజు శుక్రవారం కూడా ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ఆరవల్లి యోగివేమన, అత్తిలి, కేశవరం, కొత్తపల్లి, కొణితివాడ, జల్లికాకినాడ, గణపవరం, ఆరవల్లి–బి జట్లు పాల్గొన్నాయి. మహిళా కబడ్డీ పోటీలలో శుక్రవారం ఆరు మ్యాచ్‌లు జరిగాయి. జంగారెడ్డిగూడెం– పీఎం లంక మధ్య జరిగిన పోటీలలో జంగారెడ్డిగూడెం జట్టు విజయం సాధించింది. తణుకు– ఉండి జట్ల మ్యాచ్‌లో ఉండి, కాల్దరి– తణుకు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తణుకు జట్టు, అనంతపల్లి–జంగారెడ్డిగూడెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జంగారెడ్డిగూడెం, తణుకు–పీఎం లంక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పీఎం లంక విజయం సాధించిందని జిల్లా మహిళా కబడ్డీ సెక్రటరీ వై శ్రీకాంత్ తెలిపారు.

అ'పూర్వ' కలయిక


1990-95 నాటి విద్యార్థులు

ఇరగవరం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–95బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని తమ తీపిగుర్తులను నెమరవేసుకున్నారు. విద్యార్థి దశలో తమ అనుభవాలను గుర్తు చేసుకుని సంతోషాలను పంచుకున్నారు.అలాగే వారి వారి పరిచయాల అనంతరం విందు భోజనాన్ని చేసి తమ స్వస్థలాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.